తీపికరమైన విషయాలే. ఓ సారి భగవంతుడి మీద మీ మనసు పెట్టే విషయంలోని రుచి అందితే అప్పుడు మనసు దైవం వైపు తప్ప ప్రాపంచిక విషయాల మీదకి మళ్ళదు." వివరించాడా మహాత్ముడు.

## 39. విముక్తి

ఒకతను సన్న్యాస దీక్ష తీసుకున్నాడు. కొంత కాలం తర్వాత అతని కుటుంబ సభ్యులు అతనున్న మఠానికి వెళ్ళారు. అతను తన కుటుంబ సభ్యులందరినీ పలకరించి ఆప్యాయంగా మాట్లాడాడు.

"ఇంతకీ మా పెదనాన్న గారేరి?" అడిగాడా సన్న్యాసి.

"ఆయన నీ దగ్గరకి రావడానికి ఇష్టపడలేదు. ఎడ్లబండిలోనే కూర్చుని వున్నాడు." చెప్పారు అతని కుటుంబ సభ్యులు.

"అలాగా? సరే అయితే. విముక్తుడ్ని కాబట్టి నేనే వెళ్ళి చూస్తాను. ఆయనకి ఇంకా విముక్తి లభించలేదు కాబట్టి ఆయన అహంకారిగా ఉండటం సహజమే."

వెంటనే అతను ఊరి బయట ఆగి వున్న ఎడ్లబండి దగ్గరకి వెళ్ళి తన పెదనాన్నని చూసాడు.

## 40. మౌన భాష

నిత్యం ఏదో ఓ ఆధ్యాత్మిక ఉపదేశం చేసే తమ గురువు గారు ఆ రోజు మౌనంగా వుండటం చూసి శిష్యులు కారణం అడిగారు.

"ఇవాళ నేను చేసే ఉపదేశం భాషతో కూడిన శబ్దాల్లో కంటే మౌనంలోనే మీకు బాగా అర్ధమవుతుంది. కాబట్టి నా మౌన భాషని అర్ధంచేసుకునే ప్రయత్నం చేయండి." వివరించాడు గురువు.

కాసేపటికి గురువు శిష్యులలో పుండరీకుడనేవాడి వంక ప్రసన్నంగా చూసి వెళ్ళిపోయాడు. ఉత్సాహంగా కనిపించే అతని వంక చూసారు.

"గురువు గారి మౌనభాష నీకేమైనా అర్ధం అయిందా?" అడిగారు మిగిలిన శిష్యులు.

అయిందన్నట్లుగా తల వూపాడు పుండరీకుడు.

"అయితే అది మాకూ చెప్పి పుణ్యం కట్టుకో." అర్థించారు సహ శిష్యులంతా.

"సర్వ సమర్ధుడైన గురువుగారే బ్రహ్మాన్ని గూర్చి మాటల్లో చెప్పలేకపోయారే. ఇక నేనెలా చెప్పగలను? ఒక్క మౌనంలోనే అది బోధించగలం, అర్ధం చేసుకోగలం." పుండరీకుడు చిన్నగా నవ్వి చెప్పాడు.

## 41. పాద నమస్కారం అంతరార్థం

హిందూమతం మీద ఆకర్షణ గల, అమెరికా నించి వచ్చిన ఓ సాధకుడు హిమాలయ పాదాల్లోని ఓ చోట తపస్సు చేసుకునే ఓ గొప్ప యోగి దగ్గరకి వెళ్ళాడు. అంతా ఆ యోగికి సాష్టాంగ నమస్కారాలు చేస్తూండటం గమనించిన ఆ అమెరికన్, తన వంతు రాగానే యోగిని అడిగాడు.

"స్వామీ! అంతా మీ పాదాలకి దేనికి నమస్కరిస్తున్నారు? దాని ప్రయోజనం ఏమిటో తెలీని నాకు దయచేసి అది చెప్పండి."

అందుకా యోగి చిరునవ్వు నవ్వి జవాబు చెప్పాడు.

"మన తల అహంకారాన్ని సూచిస్తుంది. అహంకారంగా ప్రవర్తించే వాడిని వీడికి 'తలబిరుసెక్కింది' అని మా భాషలో అంటాం. మీ భాషలో కూడా అహంకారిని 'హెడ్‌స్ట్రాంగ్ ఫెలో' అంటారు కదా. ఆ తలని ఓ జ్ఞాని పాదాల మీద వుంచడం అంటే మనలోని 'నేను' అనే అహంకారాన్ని ఆయనకి సమర్పిస్తున్నామని అర్ధం. 'ఈ అహంకారం మీ పాదధూళికి కూడా సమానమైంది కాదు. దాన్ని దయతో స్వీకరించి నన్ను వుద్ధరించండి' అన్న భావాన్ని ప్రదర్శించడమే పాద నమస్కారం అంతరార్థం. ఆ అహంకారం నశిస్తే కాని జ్ఞానోదయం కలగదు."